ఉల్లాసంగా..ఉత్సాహంగా 'ఆడుదాం ఆంధ్రా'

- రెండో రోజూ కొనసాగిన పోటీలు
- ఆసక్తిగా తిలకిస్తున్న గ్రామస్తులు
- సందడి సందడిగా గ్రామాలు

పెనమలూరు: పెనమలూరు గ్రామంలో ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలు సందడి సందడిగా జరుగుతున్నాయి. ఆటల పోటీల్లో మొదటి దశగా షటిల్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 11 సచివాలయాల నుంచి మొత్తం 64 జట్లు పాల్గొన్నాయి. హోరాహోరీగా జరుగుతున్న ఈ పోటీలను తిలకించటానికి మండల పరిసర ప్రాంతాల నుంచి క్రీడాకారులు, గ్రామస్తులు, విద్యార్థులు తరలివచ్చారు. తుది పోరుకు 11 సచివాలయాల నుంచి 11 పురుషుల జట్లు, 3 మహిళల జట్లు మండల స్థాయి పోటీలకు అర్హత సాధించాయి. గురువారం నుంచి వణుకూరు గ్రామంలో వాలీబాల్ పోటీలు జరుగుతాయి. వాలీబాల్ పోటీలకు 26 పురుషుల జట్లు, 3 మహిళల జట్లు రిజిస్ట్రేషన్ చేయించుకున్నాయి.

కానూరులో అట్టహాసంగా క్రికెట్ పోటీలు

తాడిగడప మున్సిపాలిటీ పరిధిలో కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం అట్టహాసంగా క్రికెట్ పోటీలు నిర్వహించారు. మొత్తం పురుషుల జట్లు 60, మహిళల జట్లు 3 ఈ పోటీల్లో పాల్గొన్నాయి. కానూరు గురువారం వాలీబాల్, ఖోఖో పోటీలు నిర్వహించనున్నారు.



పెనమలూరులో షటిల్ పోటీలు తిలకిస్తున్న గ్రామస్తులు

వాలీబాల్ విజేత గన్నవరం-1 సచివాలయ జట్టు

గన్నవరం: స్థానిక జెడ్పీ బాలురోన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో ఆడుదాం ఆంధ్ర పోటీలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. ఇక్కడ గన్నవరం గ్రామ సచివాలయం-1, 4, చినఅవుటపల్లి గ్రామ సచివాలయం పరిధిలోని క్రీడాకారులు పాల్గొంటున్నారు. ఇప్పటికే కబడ్డీ విభాగంలో పోటీలు పూర్తి కాగా, బుధవారం వాలీబాల్ విభాగంలో పోటీలు ముగిశాయి. ఇంకా ఖోఖో, బ్యాడ్మింటన్, క్రికెట్ పోటీలు నిర్వహించాల్సి ఉందని నియోజకవర్గ క్రీడా సమన్వయకర్త దనియాల నాగరాజు తెలిపారు. సచివాలయ స్థాయిలో విజేతలుగా నిలిచిన టీమ్‌లు మండల స్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. పంచాయతీ కార్యదర్శి సీహెచ్ అనిల్‌కుమార్, పంచాయతీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాల, దావాజీగూడెం, కేసరపల్లి గ్రామాల్లో పోటీలు కొనసాగుతున్నాయి.



వాలీబాల్ విజేతగా నిలిచిన గన్నవరం-1 సచివాలయ జట్టు

సూరంపల్లిలో కబడ్డీ పోటీలు

గన్నవరంరూరల్: మండలంలోని సూరంపల్లి గ్రామంలో ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా బుధవారం జరిగిన కబడ్డీ పోటీలను ఎంపీపీ అనగాని రవి ప్రారంభించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట వెంకయ్య, నాయకులు కందిమళ్ళ రాఘవ, పంచాయతీ కార్యదర్శి కోట సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



ఆత్కూరులో వాలీబాల్ ఆడుతున్న యువకులు

కొనసాగుతున్న ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలు

ఉంగుటూరు: మండలంలో ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలు రెండవ రోజు ఉల్లాసంగా కొనసాగాయి. మండలంలోని 16 గ్రామ సచివాలయాల్లో బుధవారంకబడ్డీ, ఖోఖో, షటిల్, క్రికెట్, బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. పెద అవుటపల్లిలో ఆటల పోటీలను ఎంపీడీవో శేషగిరిరావు పరిశీలించారు. సచివాలయ స్థాయిలో జనవరి 9 వరకు ఆటల పోటీలు జరుగుతాయని ఆయన తెలిపారు. మండల స్థాయిలో జనవరి 10 నుంచి 23 వరకు, నియోజకవర్గస్థాయిలో 24నుంచి 30వరకు, జిల్లా స్థాయిలో జనవరి31నుంచి ఫిబ్రవరి 5వరకు, రాష్ట్ర స్థాయిలో ఫిబ్రవరి 6నుంచి 10వరకు ఆటల పోటీలు జరుగుతాయని వివరించారు.

క్లుప్తంగా

ఓటర్ల జాబితా సవరణ గడువు పెంపు

పెనమలూరు: కేంద్ర ఎన్నికల కమిషన్ ఓటర్ల జాబితా సవరణ గడువు పెంచిందని తహసీల్దార్ కట్టా వెంకట శివయ్య తెలిపారు. ఆయన బుధవారం వివరాలు తెలుపుతూ ఓటర్ల సంక్షిప్త సవరణ -2024 గడువు జనవరి నెల 22 వ తేదీ వరకు పెంచిందన్నారు. చేర్పులు, మార్పులు, అభ్యంతరాల స్వీకరణ కూడా జనవరి 12వ తేదీ వరకు గడువు ఉంటుందన్నారు. జనవరి 17న అభ్యంతరాలు పరిష్కారం చేస్తామని, తుది జాబితా జనవరి 22వ తేదీన ప్రకటిస్తామన్నారు. ఓటు లేని వారు ఆయా గ్రామాల్లోని బూత్ లెవల్ అధికారుల వద్ద దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఓటర్ల జాబితాపై రాజకీయ పార్టీలతో సమావేశం

గన్నవరం: స్థానిక తహసీల్దారు కార్యాలయంలో బుధవారం ఓటర్ల జాబితాపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల డీటీ గోపాల్‌రెడ్డి నేతృత్వంలో జరిగిన సమావేశంలో ఓటర్ల దరఖాస్తులపై చర్చించారు. ఈ సందర్భంగా డీటీ మాట్లాడుతూ ఓటర్ల జాబితా సవరణ తర్వాత నియోజకవర్గంలో మొత్తం ఓటర్ల సంఖ్య 2,76,802కు చేరుకుందన్నారు. ఇంకా 1,189 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు చెప్పారు. ప్రత్యేక సవరణలకు సంబంధించిన గడువు పొడిగించినట్లు తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు నీలం ప్రవీణ్‌కుమార్(వైఎస్సార్‌సీపీ), ఆళ్ళ వెంకటగోపాలకృష్ణారావు(టీడీపీ), కళ్ళం వెంకటేశ్వరరావు, బెజవాడ తాతబ్బాయి(సీపీఎం) పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

తాగునీటి సరఫరాకు ప్రత్యేక చర్యలు

రామవరప్పాడు: గ్రామంలో సురక్షిత తాగునీరు సరఫరా చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని నిడమానూరు సర్పంచ్ శీలం రంగారావు తెలిపారు. విజయవాడ రూరల్ మండలం నిడమానూరులో జలజీవన్ మిషన్ ద్వారా రూ.2 కోట్లతో మంచినీటి పైప్‌లైన్ నిర్మాణ పనులను బుధవారం ప్రారంభించారు. గ్రామంలో 40 ఏళ్ల క్రితం వేసిన మంచినీటి పైప్‌లైన్లను ఆధునీకరించి పూర్తి స్థాయిలో గ్రామం మొత్తం పైప్‌లైన్ విస్తరణ పనులు జరుగుతున్నాయన్నారు.

తేలప్రోలులో హిందూ సమ్మేళనం

ఉంగుటూరు: మండలంలోని తేలప్రోలులో శ్రీరంగమ్మ పేరంటాలు ఫంక్షన్‌హాల్‌లో సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం హిందూ సమ్మేళనం నిర్వహించారు. అనంతరం అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలు స్వర్శా కార్యక్రమం, జ్యోతి ప్రజ్వలన, భజన, సంకీర్తన కార్యక్రమాలు నిర్వహించారు. వింత శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గురువు సత్యమిత్ర,రంగమ్మ పేరంటాలు ఆలయ ధర్మకర్త జక్కా రమేష్, వింత వాసు, జిల్లా ధర్మ ప్రచారక్ జయశంకర్, గన్నవరం సబ్ డివిజన్ ధర్మప్రచారక్ యడవల్లి పాండురంగారావు, అర్జున్‌రావు, సూర్యనారాయణ పాల్గొన్నారు.

ప్రతిభా పోటీలతో విజ్ఞాన సామర్థ్యం

ఉయ్యూరు: ప్రతిభా పోటీలతో విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలు వెలుగులోకి వస్తాయని లయన్స్ క్లబ్ క్యాబినెట్ జిల్లా ట్రెజరర్ నూకల వెంకట సాంబశివరావు అన్నారు. వెలగపూడి కోటేశ్వరరావు జ్ఞాపకార్థం లయన్స్‌క్లబ్ ఆఫ్ ఉయ్యూరు, పూర్వ విద్యార్థుల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఉయ్యూరు ఏజీ అండ్ ఎస్‌జీ సిద్ధార్థ కళాశాలలో క్విజ్, వ్యాసరచన పోటీలు బుధవారం నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఎండీ ఇస్మాయిల్, జూనియర్ కళాశాల డైరెక్టర్ వినయ్‌కుమార్, ప్రిన్సిపాల్ బుచ్చిరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ

హనుమాన్‌జంక్షన్‌రూరల్: సాబార్ ప్లాస్ట్ సంస్థ రూపొందించిన 2024 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ప్రముఖ పారిశ్రామిక వేత్త పుట్టగుంట సతీష్‌కుమార్ ఆవిష్కరించారు. స్థానిక విజయవాడ రోడ్డులోని తన కార్యాలయంలో బుధవారం ఆయన క్యాలెండర్, డైరీలను విడుదల చేశారు.

వైఎస్సార్‌సీపీ నేత చిట్టబ్బాయ్ మృతి

కంకిపాడు: వైఎస్సార్‌సీపీ నేత, లయన్స్‌క్లబ్ ప్రతినిధి, వార్డు సభ్యుడు వంకదారు నాగాంజనేయులు (56) అలియాస్ చిట్టబ్బాయ్ బుధవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందారు. లయన్స్‌క్లబ్ ప్రతినిధులు, కుటుంబ సభ్యుల సమక్షంలో వాసన్ ఐ కేర్ హాస్పిటల్ బృందం చిట్టబ్బాయ్ కార్నియాలను సేకరించి భద్రపరిచి, నేత్రదానం సర్టిఫికెట్‌లను అందించారు. చిట్టబ్బాయి కుటుంబాన్ని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి పరామర్శించి, చిట్టబ్బాయ్ పార్టీకి అందించిన సేవలను కొనియాడారు. మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించిన వారిలో జెడ్పీటీసీ బాకీ బాబు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మద్దాలి రామచంద్రరావు, ఏఎంసీ వైస్ చైర్మన్ మాదు వసంతరావు, జేసీఎస్ చైర్మన్ చిరంజీవి, వైస్ ఎంపీపీ ధూళిపూడి కృష్ణకిషోర్, నెరుసు సతీష్, ఎంపీటీసీలు ఉన్నారు.

గన్నవరం పోలీస్‌స్టేషన్ తనిఖీ చేసిన డీఎస్పీ



గన్నవరం: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బుధవారం గన్నవరం సబ్ డివిజన్ డీఎస్పీ ఆర్‌జీ జయసూర్య వార్షిక తనిఖీ నిర్వహించారు. స్టేషన్ రికార్డులను క్షుణంగా పరిశీలించి, ఈ ఏడాది నమోదైన కేసులను సమీక్షించారు. పెండింగ్ కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. సీఐ పి.కనకరావు, ఎస్‌ఐలు శ్రీనివాస్, నవీన్, నాగరాజు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు

హనుమాన్‌జంక్షన్‌రూరల్: బాపులపాడు మండలం రేమల్లే, మల్లవల్లి జెడ్పీ హైస్కూళ్లలో మానవత సంస్థ ఆధ్వర్యంలో బుధవారం 10వ తరగతి విద్యార్థులకు ఉచితంగా కెరీర్ గైడెన్స్ తరగతులను నిర్వహించారు. అనంతరం గత ఏడాది 6,7,8,9 తరగతుల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహక నగదు బహుమతులతో పాటు పెదబాలశిక్ష పుస్తకం అందించారు. కార్యక్రమంలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ రాష్ట్ర కన్వీనర్ మారుబోయిన కోటేశ్వరరావు అన్నారు. మానవత జంక్షన్ శాఖ ప్రధాన కార్యదర్శి కళ్లేపల్లి నారాయణరావు, సభ్యులు వడ్డి రాజేశ్వరరావు, చక్కా సుబ్బారావు, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

సంక్రాంతి ఉత్సవాలకు అందరి సహకారం అవసరం

రామవరప్పాడు: రామవరప్పాడు శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో సంక్రాంతి ఉత్సవాలను ఎటువంటి ఆటంకాలు లేకుండా నిర్వహించేందుకు అందరూ సహకరించాలని పటమట సీఐ కాశీవిశ్వనాథ్ కోరారు. ఆలయంలో సంక్రాంతి ఉత్సవాల నిర్వహణ నిమిత్తం బుధవారం గ్రామ ప్రజలు, పోలీసు, రెవెన్యూ శాఖల అధికారులతో గ్రామసభ నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ ట్రాఫిక్‌కు ఇబ్బందులు తలెత్తకుండా ఎప్పటికప్పుడు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తారన్నారు. ఆలయ చైర్మన్ బోయిన భాను ప్రదీప్ మాట్లాడుతూ తిరునాళ్లకు వచ్చే భక్తుల సౌకర్యార్థం ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జెడ్పీటీసీ కాకర్లమూడి సువర్ణరాజు, ఆలయ ఈఓ లోకేశ్వరి, ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.

చంద్రమౌళీశ్వర స్వామికి అన్నాభిషేకం

నున్న(విజయవాడరూరల్): మార్గశిర మాసం ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని బుధవారం తెల్లవారుజామున చంద్రమౌళీశ్వరస్వామికి అన్నాభిషేకం చేశారు. సంవత్సరానికి ఒక్కసారి వచ్చే ఆరుద్ర నక్షత్రం రోజున అరుణాచలంలో జరిగే విధంగా చినకంచిలో కూడా జ్యోతి దర్శనం, గిరి ప్రదక్షిణ, అంద్రోత్సవం, అన్నాభిషేకం, పూజాకార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నసంతర్పణ చేశారు.

స్కూటీ దగ్ధం

పెనమలూరు: యనమలకుదురులో ఇంటి ఎదుట ఉంచిన బైక్ దగ్ధమవటంతో పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ టీవీవీ రామారావు తెలిపిన వివరాల ప్రకారం యనమలకుదురు సీతారామనగర్ నివాసి కర్నాటి లక్ష్మణరావు మంగళవారం రాత్రి తన స్కూటీని ఇంటి ముందు పార్క్ చేశాడు. అర్ధరాత్రి గడిచిన తరువాత పక్కింటి వారు స్కూటీ తగులబడుతోందని చెప్పడంతో లక్ష్మణరావు లేచి వచ్చి మంటలు ఆర్పాడు. బాధితుడి ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేశారు.

డోజర్ ట్రాక్టర్ చోరీపై కేసు

పెనమలూరు: డోజర్‌తో ఉన్న ట్రాక్టర్ చోరీ ఘటనపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ రామారావు తెలిపిన వివరాల ప్రకారం కంకిపాడు మండలం ఉప్పులూరు గ్రామానికి చెందిన దండుగుల నాగరాజు డోజర్ ట్రాక్టర్‌తో పనులు చేస్తాడు. అతను కొద్ది రోజుల క్రితం పెనమలూరులో ప్లాట్‌ల వద్ద పనులకు డోజర్ తీసుకు వెళ్లి పనులు చేశాడు. డోజర్ అక్కడే ఉంచి, మరునాడు వెళ్లి చూడగా కనబడలేదు. బాధితుడి ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

మానవత్వం చాటుకున్న ఆత్కూరు పోలీసులు

ఉంగుటూరు: రోడ్డు పక్కన అపస్మారక స్థితిలో పడి ఉన్న ఓ వృద్ధుడిని ఆత్కూరు పోలీసులు ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్సను అందిస్తూ మానవత్వాన్ని చాటుకున్నారు. సేకరించిన వివరాల ప్రకారం పెద అవుటపల్లి-తెంపల్లి రోడ్డులో రైల్వే గేటు సమీపంలో గుర్తు తెలియని ఓ వ్యక్తి రెండు రోజులుగా సంచరిస్తున్నాడు. బుధవారం ఆ వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉండటాన్ని అటుగా వెళ్లేవారు చూస్తున్నప్పటికీ ఎవరూ పట్టించుకోలేదు. అయితే ఓ వ్యక్తి ఆత్కూరు పోలీసులకు విషయాన్ని తెలియజేయగా, తక్షణమే స్పందించిన ఆత్కూరు ఎస్‌ఐ సూర్యశ్రీనివాస్ తన సిబ్బందిని సంఘటనా ప్రదేశానికి పంపించారు. ఆ వ్యక్తి నీరసంగా అపస్మారకస్థితిలో ఉండటాన్ని గమనించిన పోలీసులు 108 అంబులెన్స్‌లో గన్నవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యులు అతడికి చికిత్స అందిస్తున్నారు. మానవత్వం చూపిన పోలీసులను స్థానికులు అభినందించారు.

మినప విత్తనాలు పంపిణీ

కంకిపాడు: మండలంలోని మంతెన గ్రామంలో వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర మాజీ సంయుక్త కార్యదర్శి కొండవీటి వెంకట సుబ్బారావు బుధవారం 120 మంది రైతులకు ఒక్కో రైతుకు 4 కిలోల చొప్పున మినుము విత్తనాలను పంపిణీ చేశారు. స్థానిక బోసు బొమ్మ సెంటరులో జరిగిన కార్యక్రమంలో స్థానికులు గద్దల విజయకుమారి, వెలిసెల రూబెన్, వీరంకి గంగాధర్‌రావు, వీరంకి కోటేశ్వరరావు, గోగం నాగయ్య, కొండేటి రాఘవులు, లాం శేఖర్, లాం భాగ్యరాజు, లాం ప్రసన్న పాల్గొన్నారు.